క్లుప్తంగా

పార్కుల ఆధునికీకరణకు చర్యలు



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

పెదగంట్యాడ: పార్కులను ఆధునికీకరించి, ఆహ్లాదాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని 65వ కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. 65వ వార్డు కేఎల్ రావు నగర్‌లో పార్కు ప్రహరీ ఎత్తు పెంచేందుకు చేపట్టనున్న పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.4 లక్షలతో పార్కుల్లో ప్రహరీ ఎత్తు పెంచడంతో పాటు మొక్కలు నాటడం, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సత్యం, వంగపండు, రామకృష్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1061వ రోజు సంస్థకు చెందిన ఆర్ఎంహెచ్‌పీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. సరిపల్లి ఇసుక రీచ్, గర్భం మాంగనీస్ గనుల లీజును పునరుద్ధరించాలనే డిమాండ్‌తో విజయనగరం జిల్లాలోని డిస్ట్రిక్ట్ మైనింగ్ అండ్ జూలాజికల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి నాయకులు తరలివెళ్లారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహం తరలింపు

గాజువాక : కాపు తుంగ్లాంలో అనాథ మృతదేహాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రజాపతి రాంజీగా గాజువాక పోలీసులు గుర్తించారు. అనాథ మృతదేహం గురించి గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్ మానవత సంస్థ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజుకు తెలియజేయడంతో ఆయన తమ సంస్థకు చెందిన శాంతిరథంలో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు తుంగ్లాంలో రెండేళ్లుగా నివాసముంటున్నాడని, ఆయనకు ఎవరూ లేరని పోలీసులు గుర్తించి మానవత సంస్థ ద్వారా మృతదేహాన్ని తరలించారు.

నిరుపేదలకు భోజనం పంపిణీ



పేదలకు భోజనాలు పంపిణీ చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సోమవారం మెగా ఫుడ్ డొనేషన్ కార్యక్రమం నిర్వహించారు. వారే వంటలు చేసి, పేదలకు పంచారు. హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 130 మంది నిరుపేదలు, రోడ్డు పక్కనున్న బిచ్చగాళ్లకు ఒక పూట భోజనం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



మింది హైస్కూల్లో పండగ సంబరాల్లో భాగంగా 33 రకాల పిండి వంటలను తీసుకువస్తున్న ఉపాధ్యాయినులు

సంబరాల సంక్రాంతి



హరిదాసు సందడి

అక్కిరెడ్డిపాలెం: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి. భోగిమంటలు.. రంగవల్లికలు.. దూడూ బసవన్నలు.. హరి నామసంకీర్తనతో పరవశించే హరిదాసులు.. కోడి పందాలు.. బొమ్మల కొలువు.. ఘుమఘుమలాడే పిండివంటలు.. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు.. ఇలా.. పల్లెల్లోని సందడి పాఠశాలల్లో ఆవిష్కృతమైంది ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి.

మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగిపళ్ల వేడుక, రైతు సోదరుల ముచ్చట్లు, సోది చెప్పే మహిళల వేషధారణలు తెలుగుప్రజల సంస్కృతికి అద్దం పట్టాయి. పల్లె వాతావారణాన్ని ప్రతిబింబించే సెట్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డీఈవో ఎల్.చంద్రకళ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఈ వేడుకలను ప్రారంభించారు.

● పాఠశాలలకు పండగ శోభ

జగనన్నకు విద్యార్థులంటే ఎంతో ఇష్టం..: పండగ సంబరాల్లో భాగంగా సోది చెబుతామంటూ ఓ యువతి చేసిన సందడి ఆకట్టుకుంది. జగనన్నకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులంటే ఎంతో ఇష్టమని, విశాఖను అర్థిక రాజధాని చేయడం మనందరి అదృష్టమని తెలిపింది. ఎంతో అదృష్టం ఉండటం వల్లే నీ పిల్లకు మింది హైస్కూల్లో సీటు దొరికిందని మహిళ వేషధారితో ముచ్చటించడంతో విద్యార్థుల హర్షధ్వానాలు మిన్నంటాయి. పిట్టల దొర పిట్ట కబుర్లు వంటి సరదా సన్నివేశాలు అలరించాయి. తొలి పంటలో వరికంకులు.. కొత్త బియ్యం, కొత్త బెల్లంతో క్షీరాన్నం.. చేశారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాజువాక : భోగభాగ్యాల భోగి, సంబరాల సంక్రాంతి, కన్నుల పండువగా కనుమ వేడుకలను చైతన్యనగర్‌లోని రవీంద్ర భారతి స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు.

● చైతన్యనగర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో భోగి మంటలు, సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మల అలంకరణలతో సంక్రాంతి వేడుకలు సందడిగా నిర్వహించారు.

● గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి ముగ్గులు, జానపద నృత్యాలు అలరించాయి. భోగి, సంక్రాంతి, కనుమ ప్రాధాన్యతను వివరిస్తూ కార్యక్రమాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల సహకారంతో సంక్రాంతి వంటలు చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి అభినందించారు.



చైతన్య టెక్నో స్కూల్లో సంక్రాంతి ఉత్సవంలో చిన్నారుల వేషధారణలు



సోది చెబుతున్న వేషధారి



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న డీఈవో చంద్రకళ, లతీష్ తదితరులు



రవీంద్ర భారతి స్కూల్లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు



గాజువాక జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల నృత్య ప్రదర్శన



ఉక్కు డీఏవీ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

కొత్త పెన్షన్ల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పెదఅక్కిరెడ్డిపాలెం సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో 8 మందికి వితంతు, 5గురికి వృద్ధాప్య, ఇద్దరికి దివ్యాంగ పెన్షన్లు మంజూరైనట్లు వెల్ఫేర్ సెక్రటరీ బండారు శ్రీనివాస్ తెలిపారు. వీరికి వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ అడ్మిన్ సెక్రటరీ మున్నీసా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

85వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు సోమవారం పెన్షన్ పంపిణీ చేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ సభ్యుడు కొలిపాక అప్పారావు, పెదమడక సచివాలయ కన్వీనర్ గెద్దాడ సత్యవతి, నాయకులు పల్లాల అప్పారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.



పెదఅక్కిరెడ్డిపాలెంలో పెన్షన్లు అందజేస్తున్న గుడివాడ లతీష్

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

కూర్మన్నపాలెం: అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ సుపరిపాలన అందిస్తున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. ప్రజలకిచ్చిన మాట కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, పరిస్థితులు సహకరించక పోయినా సంకల్ప బలంతో ముందుకు సాగుతున్నారన్నారు. 87వ వార్డు గణేష్‌నగర్ సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉరుకూటి చందు పాదయాత్ర చేశారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చందుకు ప్రజలు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, వడ్లపూడి ఈశ్వరరావు, సీరపు పాపారావు, దుగ్గపు దానప్పలు, బొడ్డు రమణ, దాసరి అమ్మడు, సీరం అప్పారావు, ముద్దపు దామోదర్ పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఉరుకూటి చందు

స్మృతివనం పోస్టర్ ఆవిష్కరణ

కూర్మన్నపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా జనవరి 19వ తేదీన విజయవాడలో ప్రారంభం కానున్న సామాజిక న్యాయం మహాశిల్పం డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, వాడపల్లి రామచంద్రరాజు, కోమటి రమాదేవి, మార్పు శేషు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

పెదగంట్యాడ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు 75వ వార్డు దుర్గవానిపాలెం సచివాలయంలో ఘన నివాళులర్పించారు. ఈ నెల 19న అంబేద్కర్ స్మృతి వనం, 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సచివాలయ అడ్మిన్ ధనరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్పుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, ఈశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉరుకూటి చందు, నాయకులు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా కల్పన

గాజువాక : ఎస్సీ, ఎస్టీ విశాఖపట్నం డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు కటికల కల్పన నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ నుంచి అందిన ఉత్తర్వులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం ఆమెకు అందజేశారు. కల్పన తన సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విశాఖపట్నం డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధులు బోనెల జోసెఫ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నీలకంఠం, ఈశ్వరరావు పాల్గొన్నారు.



కల్పనకు ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పేకాట, కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెదగంట్యాడ మండలం పాలవలస గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట, కోడిపందాల స్థావరాలపై దువ్వాడ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పాలవలసలో గుట్టుగా పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక లక్షా ఏభై ఏడు వేల రూపాయల నగదు, 9 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కోడిపందాలు ఆడుతున్న 5 గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు వేల రూపాయలను, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు నరసింగరావు



నరసింగరావును అభినందిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు అగనంపూడి నిర్వాసిత కాలనీకి చెందిన చట్టి నరసింగరావు ఎంపికయ్యారు. స్టీల్‌ప్లాంట్‌గా కాంట్రాక్ట్ కార్మికునిగా విధులు నిర్వర్తిస్తున్న నరసింగరావు ఇటీవల విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన 41వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నడక విభాగంలో బంగారు పతకం, 15 వందల మీటర్ల పరుగు పందెంలో స్వర్ణం, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి మంగళాశాసన పాశురం

అగనంపూడి: శాంతినగర్ కాలనీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 24వ రోజు సోమవారం మంగళాశాసన పాశురం చదివి వినిపించారు. పొనగాకు మీద హారతి వెలిగించి స్వామికి సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాన్ జేసీఎం సంఘాల సమావేశం

ఉక్కునగరం: మెడికల్ ఫిట్‌నెస్ పేరిట ఉద్యోగులను బలవంతంగా తొలగించే ప్రక్రియ నిలిపివేయాలని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల నాయకులు డెడికేషన్ పార్కులో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు, సెయిల్‌లో విలీనం అంశాలపై కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులను కలవాలని వారు నిర్ణయించారు. సరిపల్లి ఇసుక రీచ్, గర్భం మాంగనీస్ గనులు రెన్యువల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విన్నవించడానికి విజయవాడ వెళ్లనున్నామన్నారు. వై. మస్తానప్ప, దొమ్మేటి అప్పారావు, శ్రీనివాసరావు, రమణారెడ్డి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

గాజువాక : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ 72వ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, షటిల్ బ్యాడ్మింటన్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించడం చరిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, వాసవి నాయుడు, ఆదిలక్ష్మి, మధు, అమ్మన్‌నాయుడు, కార్తీక్, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

68వ వార్డులో..

ఆడుదాం ఆంధ్రాలో మొదటి సెషన్‌లో విజేతలైన క్రీడాకారులకు 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెం సచివాలయంలో క్రీడా సామగ్రి అందజేశారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్లకు.. ఖోఖో మహిళా జట్లకు టీ షర్టులు, క్రికెట్ కిట్లు, షటిల్ రాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పి.సత్యనారాయణ, కె.జనార్దన్, అప్పయ్య, వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న వాసు

ఎస్ఎస్ఏ సిబ్బందికి ఆర్థిక సహకారం

పెదగంట్యాడ: ఎంఈవో కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందికి ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. సమ్మెలో ఉన్న సిబ్బంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న మండల ఉపాధ్యాయులందరూ 67వేల రూపాయలు సేకరించారు. ఈ మేరకు మండల విద్యా శాఖాధికారులు శ్రీనివాసరావు, కె.రమణాజీ చేతుల మీదుగా వారికి సోమవారం అందజేశారు.



సిబ్బందికి నగదు అందిస్తున్న ఎంఈవోలు

నైతిక విలువలతో ఉన్నత శిఖరాలకు..

ఉక్కునగరం: విద్యార్థులు నైతిక విలువలను పాటించడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలుగుతారని భాగల్పూర్ మెహీ ఆశ్రమం స్వామి సత్య ప్రకాశ్ గురూజీ అన్నారు. స్థానిక డీఏవీ పాఠశాలలో సోమవారం ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. బాల్యం నుంచి ధ్యానం, యోగాసనాల వంటివి తప్పనిసరిగా అభ్యసించాలని సూచించారు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద వంటి మహాపురుషులు చూపిన బాటలో నడవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే సతీమణి అభా పాండే మాట్లాడుతూ బాలబాలికలు విద్యార్థి దశ నుంచే నీతి నిజాయితీలను అలవరచుకోవాలన్నారు. స్వామీజీ శిష్యులు వినయ్ బాబా, పాఠశాల ప్రిన్సిపాల్ నైస్ షాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే విజయం

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు సానుకూలంగా ఉన్నారని ఆ పార్టీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తే వై నాట్ 175 టాస్క్ చేరుకోగలమన్నారు. జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ పూర్ణ ఆధ్వర్యంలో గాజువాక జేసీఎస్ కో–ఆర్డినేటర్లు సమావేశమై పలు అంశాలు చర్చించారు. అందరం సమష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గాజువాక జేసీఎస్ కో–ఆర్డినేటర్లు వాడపల్లి రామచంద్రరాజు, రెడ్డి జగన్నాధం, కులుకూరి మంగరాజు, అచ్చన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉరుకూటి చందును సత్కరిస్తున్న పూర్ణ

పోస్టర్ ప్రజెంటేషన్‌లో ‘విజ్ఞాన్’కు ప్రథమ స్థానం

అగనంపూడి: ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) రీజనల్ మీట్‌లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుల ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించింది. విజయవాడలో ఏఐసీటీఈ ఎంవోఈ ఇన్నోవేషన్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మీట్‌లో విజ్ఞాన్ కళాశాల నుంచి ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించినట్లు రెక్టార్ వి.మధుసూదన రావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ఐఐసీ జోనల్ ఇన్‌చార్జి సీమా చిల్లార్ చేతుల మీదుగా కళాశాల అధ్యాపకురాలు అర్చనా ఆచార్య బహుమతి అందుకున్నట్టు చెప్పారు.



అధ్యాపకురాలు అర్చనకు బహుమతిని అందిస్తున్న ఐఐసీ జోనల్ ఇన్‌చార్జి సీమా చిల్లార్